క్లుప్తంగా

కోటిలింగేశ్వరుడికి ఆరుద్ర పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకరుద్రాభిషేక పూజలు నిర్వహించారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని శివలింగానికి అభిషేకాలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



వనపర్తి రూరల్: హైదరాబాద్‌లోని మోతీనగర్ ఇండోర్ స్టేడియంలో ఆది, సోమవారం జరిగిన నిహన్ షోటోకాన్ కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో వనపర్తి జిల్లా కేంద్రంలోని షోటోకాన్ కరాటేకు చెందిన విద్యార్థులు బ్లాక్ బెల్ట్‌లు సాధించారని మాస్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లికి చెందిన జింకల నిఖిల్, జింకల కుమార్‌నాథ్, ఆత్మకూర్‌కు చెందిన అరవింద్ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్టులు ఫస్ట్ డిగ్రీలు సాధించారని మాస్టర్ తెలిపారు. వీరికి నిహన్ షోటోకాన్ కరాటే ఇండియా ఫౌండర్, గ్రాండ్ మాస్టర్ బ్లాక్ బెల్టులు ప్రదానం చేశారు.

వీపనగండ్ల రైతు కమిటీ ఎంపిక

వీపనగండ్ల: మండల కేంద్రంలో రైతులు, గ్రామస్తుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించే రైతు కమిటీకి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పోతుల వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కత్తి నర్సింహ, సీహెచ్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా ముంత కృష్ణయ్యయాదవ్, కార్యదర్శిగా పెబ్బేటి మహేష్, కోశాధికారిగా ఆవుల నారాయణతో పాటు గ్రామంలోని వివిధ కులాలకు చెందిన పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. గ్రామంలో అవినీతి పనులకు వినియోగించే ప్రతి పైసాను ప్రజల అవసరాల కోసమే వినియోగిస్తామని నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పాన్‌గల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని శాగాపూర్, రాయినిపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. పశువులకు గాలికుంటూ నివారణ టీకాలు వేయడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ సత్యనారాయణ, వీఏ బాలీశ్వర, పశువైద్య సిబ్బంది బుచ్చన్న, చంద్రయ్య, శివ, కార్తీక్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభించాలని వినతి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభించాలని బీజేపీ మండల యువ మోర్చా ఆధ్వర్యంలో ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చారు. యువమోర్చా మండల అధ్యక్షుడు గోపి ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ నాయకులు ఆశన్న, సత్యనారాయణ, శివశంకర్, వెంకటరమణ, రాంచందర్ తదితరులు ఎంఈఓ జయశంకర్‌ను కలిసి పలు విషయాలపై చర్చించారు. గతంలో ఈ పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ నిర్వహించినా.. అనివార్య కారణాల వల్ల మధ్యలో ఆపేశారని వివరించారు. దీనిపై ఎంఈఓ సానుకూలంగా స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం..

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం రేమద్దుల పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ డాక్టర్లు లారెన్స్, తారాశశాంక్, వైద్య సిబ్బంది రాంచందర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గడ్డి మొక్కల తొలగింపు..

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం అన్నారు. వారు మంగళవారం పట్టణంలోని తొమ్మిదో వార్డులోని పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలను తొలగించి, తాగునీటి కుళాయిల వద్ద పరిసరాలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు.



అమరచింతలో రోడ్లు శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం

నందిమళ్లలో స్వచ్ఛ భారత్..

మండలంలోని నందిమళ్లలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా నవయువ చైతన్యం యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు గ్రామంలోని ఆయా వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రపరిచారు. చేతిపంపుల వద్ద ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించారు. ఈసందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు దొమ్మర్ల రాజు మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. స్వచ్ఛ భారత్ కిడ్స్‌లో భాగంగా డైరీలు, టోపీలు, పెన్నులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు ముని, అంజి, శ్రీను, మణివర్ధన్, శ్రీకాంత్, సంజీవ, గోవిందు పాల్గొన్నారు.



రేమద్దులలో..



నందిమళ్లలో శ్రమదానం



ఆత్మకూర్‌లో..

అనీమియాపై ప్రజలను చైతన్యం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్

పాన్‌గల్: అనీమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంపై గ్రామాల్లో ప్రజలను, విద్యార్థులను చైతన్యం చేస్తూ వారు ఆరోగ్యంగా ఉండేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అనీమియా ముక్త్ భారత్ ప్రోగ్రాం వాల్‌పోస్టర్లను ఆయన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనీమియా సంకేతాలు, లక్షణాలు దాని పరిణామాలు నివారణ చర్యలు, రక్తహీనత నివారణ, చేతులను శుభ్రం చేసుకోవడం, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఐరన్, ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేయు విధానం, అతిసార వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద సంకేతాలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, వైద్యుడిని సంప్రదించడం వంటి అంశాలకు సంబంధించిన వాల్ పోస్టర్లు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాల్లో తప్పక ఉంచేలా చూడాలన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, అయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్లు తారాశశాంక్, లారెన్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసిస్తున్న చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే విద్యలో రాణిస్తారని ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం వైద్యులు హరీష్, లావణ్య, ఉమ, స్వప్న అన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన మందులు అందజేశారు. అనారోగ్యానికి గురైన పిల్లలను ప్రత్యేక అవసరాల పిల్లలుగా గుర్తించి జిల్లా స్థాయిలో అందించే మెరుగైన వైద్యం కోసం పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయ్, ఎల్లమ్మ, హెల్పర్లు నిరంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉపాధ్యాయుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, 17.29 పీఆర్‌సీ, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక పరమైన బిల్లులను వెంటనే విడుదల చేయాలంటూ మంగళవారం తపస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్దమందడి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమానికి యూటీఎఫ్ సభ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్, హెచ్ఎం మంజులత, వేణుగోపాల్‌రెడ్డి, సునీత, నళిని, చంద్రశేఖర్, సురేందర్, కవిత, గోవిందు, శేఖర్, కుర్మయ్య, రమేష్‌చారి, మల్లేష్, నిరంజన్‌గౌడ్, బాలరాజు, వసంత, సత్యనారాయణ, ఎండీ సాబేర్, అనిల్‌కుమార్, జయంతి, అర్జున్, అలీ ఉన్నారు.

కలుషిత నీటితో అనారోగ్య సమస్యలు

ఆత్మకూర్: కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతారని, స్వచ్ఛమైన తాగునీరు తాగి ఆరోగ్యం కాపాడుకోవాలని మిషన్ భగీరథ ఏఈ రుక్వేందర్‌రెడ్డి, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాం రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్లకు పరిశుభ్రమైన నీటి సరఫరా విషయమై అవగాహన కల్పించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు గాను గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సదస్సుకు తరలిన యువత

వనపర్తి: నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ఓ పంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు (స్కిల్ డెవలప్‌మెంట్) కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, ఆర్‌పీలు తదితరులు తరలివెళ్లారు. ఈ బస్‌లను డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, డీఆర్‌డీఓ ఉమాదేవి జెండాఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా తరుపున కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు

వీపనగండ్ల: రైతులు సాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబించడం వల్ల అధిక దిగుబడులు పొందొచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం బొల్లారం శివారులో సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుకుళ్లు, శనగపచ్చ, లద్దెపురుగులు వేరుశనగ పంటను ఆశించి నష్టం కలిగిస్తాయన్నారు. వ్యవసాయ అధికారులు సూచించిన ఎరువులు, పురుగు మందులనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు తిరుపతయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లికి చెందిన బోయ మన్నెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందినది. విషయం తెలుసుకున్న వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబానికి సంఘం తరపున రూ.46,500 ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి వాల్మీకి సంఘం అండగా ఉంటుందన్నారు.

వ్యక్తికి రిమాండ్

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటకు చెందిన సతీష్‌కుమార్‌పై భూతగాదాల విషయంలో ఈ నెల 8న దాడి జరిగింది. దాడి చేసిన వ్యక్తుల్లో ఒకరైన రాజనాల బాలరాజు (ఏ 1) ను అదుపులోకి తీసుకొని మంగళవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా.. నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. ఇప్పటికే ఏ 2 గా ఉన్న మరో వ్యక్తి రాజనాల అంజనేయులును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇప్పటివరకు ఈ కేసులోని వ్యక్తులందరిని అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఆదేశం మేరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. విచారణ త్వరగా పూర్తి చేసి చార్జిషీటును కోర్టులో సమర్పిస్తామని ఎస్‌ఐ వెల్లడించారు.

మహిళపై దాడి: కేసు నమోదు

పాన్‌గల్: మహిళపై దాడి చేసిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేమద్దులకు చెందిన గబ్బి జయమ్మ స్థానికంగా గాజుల షాపు నిర్వహిస్తుంది. ఇదే గ్రామానికి చెందిన రేగిచెట్టు నవీన్‌తో అవసర నిమిత్తం రూ. 60 వేలు అప్పుగా తీసుకొని ప్రాంసరీ నోటు రాసిచ్చింది. అప్పుగా తీసుకున్న డబ్బుల విషయంపై మంగళవారం నవీన్, అతడి తల్లి భాగ్యలక్ష్మి ఇద్దరు కలిసి జయమ్మ ఇంటికి వచ్చి అప్పుపై వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో నవీన్ జయమ్మను బూతులు తిడుతూ పక్కనే ఉన్న కట్టెతో దాడి చేయగా బాధితురాలి రెండు కాళ్లు, శరీరంపై కమిలిన గాయాలయ్యాయి. దాడి చేసి గాయపర్చడంతో పాటు సెల్‌ఫోన్, షాపులోని గాజులు, అద్దాలు, మీటర్‌ను ధ్వంసం చేసిన ఘటనపై జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్, అతడి తల్లిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యం

వనపర్తి రూరల్: పేద, మధ్య తరగతి వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాలంటే బీజేపీతోనే సాధ్యమని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి అన్నారు. బీజేపీ నాయకులు మంగళవారం మండలంలోని చందాపురంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు అంజి, బాలరాజు, వెంకటేష్, డాకేష్, రామకృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. గ్రామంలో సర్వే చేసి 15 మంది అనుమానితుల నుంచి తెమడ పరీక్షల నిమిత్తం శ్లైను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. వైద్యులు సూచించిన విధంగా క్రమం తప్పకుండా 6 నెలలు మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వ్యాధి సోకిన వారికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకాహారాన్ని తినేందుకు వ్యాధి పూర్తిగా నయం అయ్యేవరకు ప్రతి నెల రూ.500 అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్లు లారెన్స్, తారశశాంక్, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది..

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



పాన్‌గల్‌లో హెచ్‌ఎంలు, నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఎమ్మార్సీ సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఎఫ్ఎల్ఎన్, లిప్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా అంశాలపై ఎంఈఓ సూచనలు, సలహాలు చేశారు.

జీహెచ్‌ఎంలు, నూతన ఉపాధ్యాయులకు సన్మానం..

మండలానికి పదోన్నతిపై వచ్చిన జీహెచ్‌ఎంలు, ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం, 2024 డీఎస్సీలో వచ్చిన నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓ, ఎంఆర్సీ సిబ్బంది ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్, ఆనంద్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు, ఎంఐఎస్ డేటా ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడికి..

మండల కేంద్రలోని బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌ను పాఠశాల హెచ్‌ఎం విజయ్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో కిరణ్‌కుమార్ 2019లో మై డ్రీమ్, 2022లో లెట్‌మీ ఫ్లై, 2024లో ఫ్లయింగ్ బర్డ్స్ వంటి కవితా సంకలనాలకు సంపాదకుడిగా వ్యవహరించి విద్యార్థులల్లో సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేశారన్నారు.



మదనాపురంలో..

మదనాపురం: మండలానికి నూతనంగా 2024 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు మనోహర్, దేవ, సంధ్యారాణిని తపస్, మదనాపురం మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఫారూక్‌హుస్సేన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, అమరేందర్‌రెడ్డి, రామ్మోహన్, కిరణ్, వెంకటేష్ కృష్ణ, ప్రసాద్, మహేందర్ గౌడ్, ఈశ్వర్‌లాల్, భారతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సూగూరు పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వనపర్తి రూరల్: డీఏ, పీఆర్‌సీ పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం టీపీయుఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పెబ్బేరు మండలంలోని పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ ఉద్యమం ఆగదని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా సాంస్కృతిక కార్యదర్శి సుదర్శన్, సురేందర్, శ్రీను, ఓంకార్, చింటు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికల సంరక్షణ అందరి బాధ్యత

కొత్తకోట రూరల్: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాల బాలికలను రక్షించుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ మొబిలైజర్ హరికృష్ణ అన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం మంగళవారం మండలంలోని పాలెం గ్రామంలో 'బాలల పరిరక్షణ కమిటీ'ని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్ పంచాయతీ కార్యదర్శి నరేష్, కన్వీనర్లుగా అంగన్‌వాడీ టీచర్లు నీరజ, ప్రసన్న, శైలజ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భాస్కర్‌ను ఎంపిక చేయడంతో పాటు కమిటీ సభ్యులుగా గ్రామ ప్రజలు, యువకులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ 18ఏళ్లు నిండని అమ్మాయికి, 21ఏళ్లు నిండని అబ్బాయికి పెళ్లిళ్లు చేయకూడదన్నారు. పిల్లలను బడి మాన్పించి పనిలో ఉంచినట్లయితే బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సబిత, ఏఎన్ఎం హేమలత, తిరుపతమ్మ, ఆశా వర్కర్లు, గ్రామ పోలీసు అధికారి రవి తదితరులు ఉన్నారు.

మహిళా సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలి..

ఆత్మకూర్: గ్రామాల్లో త్వరతగతిన మహిళా సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. కిషోర బాలికలకు పౌష్టికాహారం, మహిళల భద్రత, బాల్యవివాహాలు, తదితర విషయాలపై గ్రామాల్లో మహిళా సంరక్షణ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

వనపర్తి రూరల్: గ్రామాల్లో ఏర్పడిన బాలల సంరక్షణ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని బాలల సంరక్షణ అధికారి సురేందర్ అన్నారు. పెబ్బేరు మండలంలోని సూగూరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం బాలల సంరక్షణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బాలలకు మెరుగైన బాల్యం గడిపే అవకాశం దక్కాలని, వారి రక్షణ కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలీశ్వరి, హెచ్‌ఎం రమణశర్మ, పంచాయతీ కార్యదర్శి శ్యాంగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పాలెంలో మాట్లాడుతున్న ఆర్డీఎస్ ప్రతినిధి హరికృష్ణ

ఖిల్లాఘనపురం: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈదమ్మ, ఎంపీఓ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని సోళీపురం, ఖిల్లాఘనపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాల్యవివాహాల వలన భవిష్యత్‌లో బాలికలు అనారోగ్య సమస్యలతో బాధపడే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రత్యేక అధికారులు చైర్మన్‌గా, అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శులు సభ్యులుగా, పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా సమైఖ్య సంఘం లీడర్లు, ఏఎన్‌ఎంలు, యువజన సంఘాల నాయకులు, ఆశాకార్యకర్తలు, వీఓఏలు తదితర వారు 11 మందితో కమిటీలను ఏర్పాటు చేశారు.

పోరాట యోధుడు కొమురంభీం



కొమురంభీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: తెలంగాణ పోరాటానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన పోరాట యోధుడు కొమరం భీం అని ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. కొమురంభీం జయంతిని పురస్కరించుకొని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు నాయకంటి నర్సింహాశర్మ, మండ్ల దేవన్న, బాలస్వామి, బండలయ్య, వెంకటస్వామి, యూసూఫ్, చిలుక సత్యంసాగర్, పరమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.